# గెలుపు

ఎప్పుడూ వరండా చీడీలయినా దాటి పైకిరాని డ్రైవరు నాయరు - మా యింటి లోపలికే పరుగెత్తుకొని వచ్చాడు అతని ముఖంచూస్తే ఏదో దెబ్బతిన్న లేడి లాగ కనిపిస్తున్నాడు. కళ్ళనీళ్ళ పర్యంతం వచ్చింది; నిలువు నా నీరైపోయినట్టు ఉన్నాడు. అతను ఏం చేస్తూఉన్నాడో అతనికే తెలియదేమో! అందుకే లోపలి గదిలోకి పరుగెత్తుకొని వచ్చి "అయ్యాగారూ-ఆల్లు సూడండి ఎంత అన్యాయం సేసింది-నాకు గుఱ్ఱం గెలిచింది-అస్లె తీసుకుంటా నంటుంది" అని వాడి వచ్చీరాని తెలుగులో చెప్తున్నాడు. అంతా బయటికి వచ్చాం వరండా ఎదుట-పోర్టికోలో కారు నిలిచేచోట కొంతమంది జనం గుంపుకూడి ఉన్నారు. వాళ్లలో ప్రక్కయింటివాళ్ల నౌకర్లు, ఎదుటి పూరిగుడిసెలో పెట్టెలు చేసేవాళ్లు- మరో పొరుగుయింటిలో చింత పండు అమ్మేవాళ్ళూ వీళ్లంతా ఉన్నారు

అసలు మా డ్రైవరు నాయరు చాల మంచివాడు. ఎవళ్ళ జోక్యమూ కలిగించుకొనే రకంకాదు. గట్టిగా మాటలాడటం కూడా వాడికి చేతకాదు. కారు త్రిప్పినంత సేపు త్రిప్పడం లేకపోతే కారు శుభ్రంచేయడం, కడగడం ఇలాంటి పనులు చూస్తాడు. తనకి పనిలేనప్పుడు, షెడ్డులోనే పడుకొని యేదో పాతమళయాళం పత్రిక చదువుకుంటూ కూర్చుంటాడు. ఒకోసారి ప్రక్క పూరి గుడిసెలో పెట్టెలుచేస్తున్న వాళ్ళ దగ్గర కూర్చుంటాడు. వాళ్లు రంగులు వేయడం, కుట్టడం, మేకులు కొట్టడం ఇవన్నీ శ్రద్ధగా చూస్తూ ఉంటాడు వాళ్లూ మళయాళంవాళ్ళే అవడంచేత వాళ్ళు చెప్పేమాటలు వింటూ ఉంటాడు. అలాగే-నాలుగుబారల దూరంలో ఉన్న కిళ్ళీకొట్టు దగ్గరకుపోయి తములపాకులు వక్క తెచ్చుకొని ఆ పెట్టెలవాళ్ళతో కలిసి తాంబూలం సేవిస్తాడు. అంతే. ఇది తప్ప ఇంక ఏ వ్యాసంగమూ డ్రైవరు నాయరుకు లేదు కారు నడిచేటప్పుడు కూడా అనవసరంగా ప్రసంగాలు చెయ్యడు. పలుకరిస్తే ఒకటిరెండు చిన్న మాటలతో జబాబు చెప్పడమే అంత మౌనంగా ఉంటాడు కాని పనిలో చాల సమర్థుడు.

చిన్న చిన్న మరామతులువస్తే తానే స్వయంగాచేసి బాగుచేస్తాడు మొన్న రేడియేటరులోని నీళ్ళగొట్టం చెడిపోయింది.

## శ్రీ వాత్సవ

కొత్తదికొని తానే వేశాడు అదే కంపెనీకి పంపిస్తే ఇరవైముప్ఫైరూపాయలు అవునట. అలాగే కార్బ్యురేటర్-ట్యూనింగ్ చెయ్యడం, ప్లగ్గులు తుడవడం, బ్యాటరీ బిగించడం ఇలాంటి చిన్నపనులు అవలీలగా చేస్తాడు. అందుకే-నాయరు పని చూచి భోజనంపెట్టి నెలకి యాభైరూపాయలు చేశాం దానితో వాడికి తృప్తికలిగింది; అతని పనిచూచి మాకు తృప్తి కలిగింది

ఆవేళ ఆదివారం. మద్రాసులో జరుగుతూవున్న గుఱ్ఱపు పందాలు ఆవేళతో ఆఖరు ఉదయం వచ్చి ఒక అరగంట సెలవు కోరాడు ఎందుకో అని అడిగితే ఒక టిక్కట్టుతియ్యాలని అన్నాడు. ఆ సెలవు తీసుకొని సైకిలుమీద తిన్నగా గిండీలో రేస్‌క్లబ్బుకి పోయాడట. అయిదు రూపాయలకు ఒక ట్రెబుల్ టిక్కట్టు తీశాడట. ఆ టిక్కట్టు తన జేబులోనే వుంది. తిరిగి వెంటనే వచ్చేశాడు. మేమంతా కలిసి ప్రొద్దున్న ఒక సినీమాకు పోతూ ఉన్నాము నాయరు డ్రైవు చేస్తున్నాడు. మధ్యత్రోవలో ఏదో దేవాలయంవస్తే చటుక్కన కారు ఆపి మ్రొక్కుకున్నాడు. కారులో ఉన్న జనంలో ఒకరయిన కృష్ణయ్యగారు నాయరును-'ఏం నాయరూ? ఏమిటి విశేషం' అని ప్రశ్నించారు.

"నేను - యీ వేళ రేసెస్‌లో - ఒక టిక్కట్టు తీసింది" అన్నాడు.

"టిక్కట్టు,తీసినంత మాత్రంతో వస్తుందా?"

"వస్తాదండి బాబు! ఈవేళ చూడండి"

"వస్తే ఏంచేస్తావు? ఇక్కడ పని మానేసి కారుకొంటావా?"

"ఇళ్ళే లేదండి-పనిచేస్తా ఉంటాను. బ్యాంకులో దాచేస్తును"

"అయితే నువ్వు తరచు గుఱ్ఱపుపందేలకు కట్తావా?"

"లేదండి. సంవత్సరానికి ఒక్కసారిదా రేసెస్ ఆఖరురోజున కట్టుదును"

"ఎన్నాళ్లనుంచి కట్తున్నావు?"

"పదిసంవత్సరాలనించి కట్టున్నాను?"

"ఎప్పుడైనా నీకు వచ్చిందా?"

"లేదండి ఇది ఏమవుతుందో చూచి ఇంక మానివేస్తును."

"అయితే నాయరు-నీకు డబ్బు ఎక్కడ నించి వచ్చింది?"

"మన యింట్లోదా-శాంతమ్మ ఉన్నారే వారుదా అంజిరూపాయ ఇస్తురు గెలుస్తే-మరి అంజి-(అయిదురూపాయలు) నానుదా ఇస్తును"

"అయితే బాగానే ఉంది. ఏంనెంబర్లు తీశావు?"

"ఇదిగో టిక్కట్టు చూడండిసార్-మన రెండుబండ్లు నెంబర్లు తీశాను. మూడవది-మన చంటిపా తీసింది"

"బాగానే ఉంది లాటరీ. అయితే 6, 10, 8 ఈ నెంబర్లు వస్తే గెలిచినట్టు లేకపోతే పోయినట్టు-"

"ఆమాసార్"

"అయితే-పందేలకి నువ్వు వెళ్తావా?" అని కృష్ణయ్య అడగగానే మా బావగారు అందుకుని 'ఎలాగ వెడతాడు మనం సాయంకాలం టీపార్టీకి పోవాలికదూ?" అన్నారు. దానిమీద నాయరు" నేను పోను సార్ వస్తే మన యింటిప్రక్క పెట్టెల వాళ్ళకి యిచ్చివేశాను. వాళ్లుదా సొమ్ము తెస్తురు"అన్నాడు.

అలాగ మేము వెళ్ళిపోయాము. సాయంకాలంవరకు ఈమాటే జ్ఞాపకంలేదు.

సాయంకాలం మా కారు తిరిగి వచ్చేటప్పటికి 8 గంటలయింది. నాయరు


**కుష్ఠు ★ బొల్లి**

వగైరా మేహామచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం. జి వి రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ గోదావరి.

రాగానే పెట్టెలవాళ్ల గుడిసెలోకి వెళ్లాడు. నాయరు వేసిన టిక్కెట్టు వచ్చినదట. సరిగ్గా మూడు నెంబర్లూ వచ్చాయి అయిదురూపాయల టిక్కెట్టుమీద రు. 2015 లు వచ్చాయి టిక్కెట్టు ఇచ్చిన వెంటనే సొమ్ముకూడా వసూలు అయిపోయింది. ఆ పెట్టెవాళ్లు కూడా చాల గుఱ్ఱాలమీద ఆడారట. అవన్నీ పోయాయి అందుకని వాళ్ళు ఒక పెద్ద యెత్తువేశారు. ఆ సమయానికి తాము ఉండి అంతా కనిపెట్టి చూడబట్టి యీ పందెం గెలుపు వచ్చింది కాని లేకపోతే రాదని వాళ్ల వాదం. ఆ కారణంచేత వాళ్లకు చెరిసగం సొమ్ము రావాలని పేచీపెట్టుతున్నారు. అసలు తెచ్చిన సొమ్ము చేతిలో పెట్టమనేవాళ్ల పట్టు.

అందుకే ఆవేళ డ్రైవరు పరుగెత్తుకొని రొప్పుకుంటూ లోపల గదిలో ప్రవేశించాడు. మా బావగారి కాళ్ళమీద పడి ఈ తగాదా పరిష్కారం చెయ్యాలని కోరాడు. కృష్ణయ్యగారు కూడా అక్కడే ఉన్నారు. మా అందరిలోకీ ఆయనే ఒక పెద్ద వ్యవహర్త. వెంటనే పెట్టెలవాళ్లని పిలువమన్నారు. సంగతి విచారించారు. వాళ్లు అన్నీ ఒప్పుకున్నారు. ముందు తెచ్చిన సొమ్ము రు. 2015 లు అక్కడ పెట్టించారు అది మావద్ద వుంచడానికి- వెంటనే రేస్‌క్లబ్బుకు వెళ్లి ఆ క్లబ్బులో పెద్దలు ఎలా తీర్పు చెబితే అలాగ చెయ్యడానికే నిశ్చయించారు. నాయరుకొన్న టిక్కెట్టులో నెంబర్లు రూఢిగా తెలుస్తూనే ఉన్నది. అతను కోరు నెంబర్లు కలిపివేసి వచ్చిన మొత్తం ఒకొక్క నెంబరుగా వేశాడు. మూడో నెంబరుకు లాటరీ వేసి మా పాపచేత కలిపి తీయించాడట. ఆ నెంబర్లుగల టిక్కెట్టు కొని తెచ్చాడు. ఉదయం మాకు కూడా చూపించాడు.

అందులో మార్పుఏమీ లేదు. అందుచేత న్యాయంగా ఆ సొమ్ము నాయరుకి రావలసిందే. పెట్టెలవాళ్లవాదం ప్రకారం ఇందులో వంతు ఏమీలేదు అయితే వాళ్లు కూడా పందేలకుపోయి నష్టపోయారు కాబట్టి-ఇద్దరున్నారు-వాళ్లే యిద్దరకు చెరి ఒక యాభై ఇవ్వడానికి నాయరుచేత ఒప్పించి పరిష్కారంచేశారు. కారుతుడిచే కుఱ్ఱవాడికి వంతుఉంది అంటాడు. అనుకున్న ప్రకారం, శాంతమ్మవద్ద బదులు పుచ్చుకున్న అయిదురూపాయలకు మరొక అయిదు కలిపి మొత్తం పదిరూపాయలు ఇచ్చివేశాడు. మా పాపచేతిలో పది రూపాయలూ పెట్టబోయాడు. అక్కర లేదని ఇచ్చివేశాం. పెట్టెలవాళ్ళకు యాభైయేసి రూపాయలు ఇచ్చాడు దేవుడి గుడిలో యాభై కొబ్బరికాయలు కొట్టానన్నాడు. మిగతా సొమ్ము బ్యాంకులో వెయ్యాలని నాయరు సంకల్పం.

రోజూలాగే ఆవేళ బయటికివెళ్లి తిరిగి వచ్చాము. ఇది పందేలు గెలిచిన మన్నాడు. రాత్రి 10 గంటలయింది. భోజనంచేసి నాయరు ఇంటికి వెళ్తున్నాడు ప్రక్క సందులోంచి కాలినడకను పోతున్నాడు. ఎదురుగా ఆ కిళ్ళీకొట్టు గోపాలన్‌నాయరు చింతపండు అమ్మే సంబంధం ఎదురుగా వచ్చి నిలిచారట. వాళ్ల చేతిలో చిచ్చుకత్తులు పట్టుకుని-ఏదీ మావంతు ఏంచేశావు ఇస్తావా చస్తావా? అని బెదిరించారట. అలాగే యిస్తాలెండి అని చెప్పి ఒక్క ఊదుటన యింట్లోవెళ్లి పడ్డాడు.

ఇంటికి చేరుకున్నాడే కాని కంటికి నిద్దుర రాదు తెల్లవార్లూ పాడికళ్ళు అయిపోయాయి పెళ్ళాంతో పలకడు ఉలుకడు రోజూ రాగానే ఎత్తుకొని ముద్దాడే చంటిపిల్లవాడిని కూడా చేరనివ్వడు మతిపోయిన వాడిలాగ ముఖంపెట్టి వెఱ్ఱివాలకంతో బెరుకు చూపులు చూస్తూ ఉన్నాడట ఎక్కడనించి ఆ దుర్మార్గులు వచ్చి చంపుతారో అని భయం. "అయ్యో ఎందుకు వచ్చింది యీ గెలుపు? ఇది రాకపోయినా ప్రాణం హాయిగా ఉండేదే! అందరూ బెదిరించేవాళ్ళే. అంతా వంతులు కోరేవాళ్ళే ఈ వచ్చిన సొమ్ములో ఎందరికి ఇవ్వను? ఇవ్వకపోతే ప్రాణాలకే అపాయం కలిగేటట్టుగా ఉన్నది శ్రీరామచంద్రా! ఏది దారి? అని పరిపరివిధాల తలపోశాడు తెల్లవారేవరకు ఒక వెయ్యి యుగాలు గడచినట్టయింది

తెల్లవారగానే తిరిగి తన కారులు, పని డ్రైవింగ్. అయితే వాళ్ళు పొంచి కూచునే ఉన్నారు. ఒంటరిగా రావడం చూచి కత్తులూ కటారులూ చూపించి భయపెట్టూనే ఉన్నారు. ఈ యిద్దరే కదాఅని వదుల్చుకుందాం అని యాభైయేసి రూపాయలు మళ్ళా పంచాడు. ఇదివరకు ఎంతో ఆప్యాయంగా చూచే పెట్టెలవాళ్ళు మాటలాడటం లేదు సొమ్ము ఇచ్చినా కూడా వాళ్ళు కంట్లో నిప్పులు పోసుకొంటు

(39-వ పేజీ చూడండి)



కేశవర్ధని అ 14, షాంపూ అ 14 అందరు డీలర్లవద్ద లభిస్తాయి
లేక సౌత్ ఇండియా కెమికల్స్, క్రాస్‌కట్ రోడ్, కోయంబత్తూరుకు వ్రాయండి.

# గెలుపు

(21-వ పేజీ తరువాయి)

న్నారు. లేనిపోని అసూయ. చుట్టుప్రక్కల పలకరించేవాళ్ళే లేరు. ఎటుపోవాలన్నా భయమే. కిళ్ళీకొట్టువాడు, చింతపండు బండివాడు, పెట్టెలవాళ్లు అందరూ స్నేహకోటిలో వాళ్లే పూర్వం. ఈ గెలుపు తర్వాత ప్రతిఒక్కడూ పక్కలో బల్లెం. ఇంట్లో శాంతమ్మతోపాటు - ఇతర చిన్న నౌకర్లకి ఒకో రూపాయ ఇచ్చాడు. అయినా తృప్తిలేదు. డబ్బిచ్చి శత్రుత్వం కొని తెచ్చుకున్నట్టు ఇంటికి వెళ్లడానికి భయంతో త్రోవలో ఎవళ్ళువచ్చి ఏంచేస్తారో? గ్రుక్కెడు ప్రాణం తియ్యడానికి ఎంతసేపు కావాలి? తాను ఇంటికి చీకటిలో నడచివెళ్తూ ఉంటాడు, ఆ ప్రక్కసందులో నించి వచ్చి ఏ చాకుతో గుచ్చివేసిగా పైసలా- చాకు దాకా ఎందుకు; గట్టినా బలంఅయిన చేతులతో పీక నొక్కివేసినా చాలు. ఇంతెందుకు - ఆ ఎత్తుగోడమీద నించి ఒక బండరాయివేస్తే చాలు పచ్చడి అయిపోతాడు. అయ్య బాబోయ్! అప్పుడే చావు ఏమిటి? తాను ఇంకా చాలకాలం జీవించాలి. తన వయస్సు 28 యేండ్లేకాదూ? ఇంకా సగం వయస్సు పైగా ఉంది. తాను అనుభవించింది ఏముంది? కష్టాలతోటే సరిపోయింది. తమ్ముళ్లను చదివించడం, కుటుంబ ఖర్చులు భరించడం. పెళ్ళిచేసుకోవడం ఇవన్నీ కష్టంతో కూడిన ఖర్చులే. తన సంపాదన అంతా ఎలాగో ఖర్చుఅయిపోతూ వుంది. చంటిపిల్లవాడికి జబ్బుచేస్తే అయ్యగారివద్ద నించి అడ్వాన్సు పదిరూపాయలు తీసుకోవలసివచ్చింది. ఆ మహారాజు దయగా వదిలేశారు కనక సరిపోయింది కాని యీ పది రూపాయలు తగ్గితే ఎంత కష్టం అయ్యేది. ఏమైనాసరే బతికిఉంటే బలుసాకైనా తినవచ్చు బలుసాకు ఏమిటి - ఈ గెలుపు సొమ్ముతో ఒక చిన్న యిల్లు ఏర్పాటుచేసుకొని అక్కడే ఒక గేదెను కొంటే దానివల్ల నెలకోవంద, వంద యాభై మిగులుతాయి. ఆ ప్రక్కయింటి పెరుమాళ్లు చూడరాదూ? ఒక్క గేదెతో ఎలాంటి వ్యాపారం చేస్తున్నాడో! అయితే తనకు ఎలాగు కుదురుతుంది? 'అథదాని తెలివితేటలలో ఉంది పెరుమాళ్లు పెళ్లాం కుమ్మమ్మకున్న తెలివితేటలు తన భార్యకున్నాయా? పిల్లవాడిని పెంచడానికే పెద్ద బ్రహ్మాండం చేస్తుంది? అయితే యేంలే-గేదె ఒకటి కొనిఉంచితే ఒక మనిషిని పెట్టుకోవచ్చు. అన్నీ బాగానే ఉన్నాయి ముందు ఈ గండం గడచి బయటపడితేను! వాళ్లు ఇరుగుపొరుగు వాళ్ళు ఎంత దుర్మార్గంగా ఉన్నారో! పోలీసువాళ్ళకు రిపోర్టుచేస్తేనో? ఏం లాభం? ఏమైనాసరే వారం పదిరోజుల వరకు ఇంటికి వెళ్ళకూడదని నిశ్చయించాడు. డ్రైవరు నాయరు మా యింటిలోనే కారు షెడ్డులోనే ఉండిపోతున్నాడు. పగలు బట్టలుమార్చుకోవడానికి వెళ్లి మళ్లీచిన్న కారులో వచ్చేశాడు. ఈ సంగతి చూడలేక మేము పోలీసువారికి కూడా రిపోర్టుచేశాం. వాళ్లు వచ్చి ఇరుగుపొరుగు వాళ్ళను అందరినీ విచారించి వెళ్ళారు. వాళ్లు అందరూ ఏమీ ఎరగనట్టు నటించారు. మళ్ళీ పోలీసువాళ్లు పోగానే-గేదె కొన్న పెరుమాళ్లూ, చింతపండు అమ్మే సంబంధం కలిసివచ్చి-'ఏం నాయరు! గేదె కొంటావట నిజమా? ఈ గెలుపు చూచుకొని కళ్లు నెత్తిమీదకు వచ్చాయే?" అని చేతిలో గడ్డపార నెత్తిమీదికి ఎత్తాడు.

నాయరు గుండెలో ప్రాణాలు నిలువునా ఎగిరిపోయినంత పని అయింది. ఆ వేళ ఇంటికి వెళ్ళినపుడు పెళ్లాం విసుగుకుందట. "ఇదేమిటి-గెలుపువచ్చిన తర్వాత బొత్తిగా మతిపోయినట్టు ఉందేమిటి? ఇంటిపట్టున ఒక్క క్షణం ఉన్నదే అరుదైపోయింది" అన్నదట. కోపంమీద పెళ్ళాన్ని చెంప వాచేటట్టు కొట్టి తిరిగి వచ్చాడు.

ఆ వేళ కారులో మేమంతా వెళ్తూ ఉంటే పరధ్యానంగా డ్రైవుచేస్తున్నాడు. ఎదురుగా లారీవస్తూ ఉంది. చూచుకోలేదు. టర్నింగ్‌లో హారన్ కొట్టడం మరచిపోయాడు. ఈ కారు ఢీకొని-పప్పుఅయిపోవలసిందే. ఒక వీసంలో తప్పిపోయింది. మా కందరికీ గండం గడచింది. మా బావగారు నాయరుమీద కేకలేశారు. పనిలోంచి తీసివేస్తామన్నంత కోపం చూపించారు. నాయరు క్షమార్పణ కోరుకున్నాడు.

నాయరుకి ఏం తోచిందో బ్యాంకుకి వెళ్లి ఆ సొమ్ము తీసుకొనివచ్చి-అందరికీ పంచిపెట్టివేశాడు. గేదెవాడు, చింతపండువాడూ, కిళ్ళీకొట్టువాళ్లూ-యింకా చాలమంది పంచుకొన్నారు. భార్యకు ఏమాత్రమో ఇచ్చాడు. ఆ గెలుపు సొమ్ము తనదగ్గర ఉన్నంతకాలం తనలో బలం అంతా పోయినట్టయింది. క్షణక్షణం తానొక నీడలాగ అయిపోతున్నట్టు తోచింది. అది పోగానే ఎప్పటివాడు అయ్యాడు. ఆ సొమ్ము తన దగ్గర ఉండటం ఏదో అపరాధం చేస్తున్నట్టు అనిపించింది. ఎంతమందికో అన్యాయంచేసి వాళ్ల ధనం తాను బలవంతంగా లాక్కున్నట్టు తోచింది. అందుకే అది అయిపోగానే - కొంత భారం తగ్గినట్టయింది.

ఇది జరిగిన మరునాడు రాత్రి పదిగంటలకు మమ్మల్ని వదలిపెట్టి యింటికిపోతున్నాడు. ఇదివరకు తనకు తెలియనివాళ్ళు ఇద్దరు ఎదురయ్యారు. వాళ్ళ చేతిలో ఇనపకట్టులున్నాయి. "ఏం నాయరూ! గెలుపు వచ్చిందటనే" అని పలుకరించారు.

"వస్తే మీకేం?" అని ఎదుర్కున్నాడు. వాళ్ళు వికటంగా నవ్వి ఇనపకట్టులు చూపారు.

"ఇది వేళాకోళంగా ఉందా? గెలుపు వచ్చింది పోయింది. ఈమాటు నన్ను భయపెట్టాలని చూస్తున్నారేమో. రండి-ఏం చేస్తారో" అని ఒకడిమీద కలియబడి ఇనపకట్టు లాగుకుని రెండోవాడిని ఎదుర్కున్నాడు. ఇద్దరినీ చావమోదాడు. ప్రళయకాలరుద్రుడిలాగ నాట్యంచేశాడు. అతనిలో కొత్తబలం చూచి ఆ దుండగీండ్రు పరారీఅయ్యారు ఇన్నాళ్లు భయంవల్ల అణగారిపోయిన తన శక్తులన్నీ ఒక్కసారి ప్రజ్వలించాయి. తిరిగి మనిషి అయ్యాడు. ఇదివరకు, పరిస్థితులకు వాటిని వీలుచేసుకొని తనమీదపడిన మనుషులకీ లొంగిపోయాడు. ఈనాడు, ఈ సమయంలో వాటి నన్నిటినీ లొంగదీసుకున్నాడు. అణగారిన తన బలాన్ని కనుక్కున్నాడు. కొత్త ధైర్యం తెచ్చుకున్నాడు. కొత్తశక్తి తెలుసుకున్నాడు. మనిషిఅయ్యాడు. ఇంతవరకు తాను భయపడిన శత్రువులు తాను కల్పించుకొన్నవాళ్ళే. తనలోని దౌర్బల్యాలే. తనలోని చేతకానితనం, పిరికితనం సృష్టించినవే. అవి పారద్రోలిన వెంటనే బ్రతుకు పోటీలో గెలుపు సాధించాడు. అదృష్టం, ఛాన్సు, అవకాశం ఇచ్చిన గెలుపుకంటె ఈ గెలుపు వెయ్యిరెట్లు సుఖం ఇస్తుంది. ఆనందం కలగజేస్తుంది. మనిషిని మనిషిగా నిలవబెట్టుంది అవలీలగా రెండువేలరూపాయల గెలుపు ఇయ్యలేని ఉత్సాహం, ఓజస్సు ఒక్క క్షణంలో ఈ గెలుపు వల్ల తనకు లభించింది.

నాయరు గెలిచాడు. ఇంక ఫరవాలేదు.

★